సాక్షి తిరుపతి

గురువారం । 19 । అక్టోబర్ । 2023



క్షేత్రస్థాయికి 'సంక్షేమం'

ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని క్షేత్రస్థాయిలో వివరించాలని రామ్‌కుమార్‌రెడ్డి కోరారు. - IIలో



అభ్యసన సామర్థ్యం పెంచేలా బోధన

విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెంచేలా బోధన ఉండాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. - IIలో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	33	22
చిత్తూరు	33	21
తిరుమల	30	18
గూడూరు	35	24
నగరి	34	22

న్యూస్‌రీల్

వ్యవ'సాయం'లో తిరుపతి టాప్

- ఉత్తమ జిల్లా అధికారిగా తిరుపతి డీఏవో ప్రసాదరావు
- ఉత్తమ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా యమున



ప్రసాద్‌రావు

తిరుపతి అర్బన్: వ్యవసాయ శాఖకు సంబంధించిన సేవల్లో సెప్టెంబర్ నెలకు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ జిల్లాగా తిరుపతి ఎంపికైంది. ఉత్తమ వ్యవసాయ అధికారిగా డీఏవో ఎస్.ప్రసాదరావు, ఉత్తమ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా వడమాలపేట ఆర్బీకేలోని అగ్రికల్చర్ అసిస్టెంట్ పి.యమున ఎంపికయ్యారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ కమిషనర్ సీహెచ్ హరికిరణ్ బుధవారం ప్రకటించారు. ప్రతి నెల వ్యవసాయశాఖలో ఉత్తమ జిల్లా, ఉత్తమ అధికారుల పేర్లను రైతు భరోసా పుస్తకంలో ప్రచురించడం ఆనవాయితీ. ఫిబ్రవరి, మార్చి, ఆగస్టు నెలల్లోనూ ఉత్తమ జిల్లా వ్యవసాయ అధికారిగా ప్రసాదరావు అవార్డులు పొందారు. జిల్లాలో రైతులకు విత్తనాలు, ఎరువులు, పనిముట్ల పంపిణీ, మట్టినమూనాల సేకరణ, పొలంబడి నిర్వహణ, ఆర్‌కేవీవై నిధుల సద్వినియోగం, సీహెచ్‌సీ పథకం అమలు, ఈ–క్రాప్ నమోదు, ఆఫీస్ రికార్డుల క్రమబద్ధీకరణ తదితర 22 అంశాల్లో తిరుపతి జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది 85 నుంచి 100శాతం పూర్తిచేశారు. దీంతో ఉత్తమ జిల్లాగా తిరుపతి నిలిచింది.

25 వరకు మిలిటరీ స్కూళ్లల్లో దరఖాస్తుకు గడువు

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్రీయ మిలిటరీ స్కూళ్లల్లో 2024–25వ విద్యా సంవత్సరంలో 6వ తరగతి(బాలబాలికలు), 9వ తరగతి(బాలురు)లో జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 25వ తేదీ వరకు గడువు పొడిగించారు. ఆ మేరకు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ముగిసిన 'మిల్లెట్స్' సదస్సు




మాట్లాడుతున్న ఎమ్‌సీవీ ప్రసాద్

తిరుపతి సిటీ : తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ మిల్లెట్స్ ఇయర్–2023 సదస్సు బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో అల్పాహారం తయారీ అంశంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వనం వ్యవస్థాపకుడు ఎమ్‌సీవీ ప్రసాద్ మాట్లాడుతూ మిల్లెట్స్‌ను రోజువారీ ఆహారంలో స్వీకరిస్తే చక్కటి ఆరోగ్యం పొందవచ్చునన్నారు. ప్రకృతిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. అకాడమిక్ డీన్ అఫైర్స్ ప్రొఫెసర్ టీవీ రాఘవాచార్యులు మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా చిరుధాన్యాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. అతిథులను కార్యక్రమ కో–ఆర్డినేటర్ పి.మాధవరావు సత్కరించారు.

నయనానందకరం

గోవిందనామ స్మరణలు.. జీయ్యంగార్ల గోష్టి గానాలు.. భక్త బృందాల భజనలు.. మంగళవాయిద్యాలు.. కళారూప ప్రదర్శనల నడుమ ఉభయ దేవేరీ సమేతంగా మలయప్ప స్వామివారు వైభవోపేతంగా దర్శనమిచ్చారు. కల్పవృక్షం నీడలో రాజసంగా రాజమన్నార్ కటాక్షించారు. అష్టదిక్పాలకుల సేవలో సర్వభూపాల వాహనంపై సర్వాంతర్యామి కొలువుదీరి మాడవీధుల్లో విహరించారు. వైకుంఠనాథుని దివ్యమంగళరూపాన్ని వీక్షించి భక్తులు తన్మయత్వం చెందారు. నవరాత్రి బ్రహ్మోత్సవ వేళ శ్రీవారి అనుగ్రహం పొంది ధన్యులయ్యారు.



కల్పవృక్ష వాహనంపై దేవదేవేరులు



సర్వభూపాల వాహనంపై శ్రీవారు





- వైభవంగా శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- కనులపండువగా కల్పవృక్ష వాహనసేవ
- సర్వభూపాల వాహనంపై ఊరేగిన మలయప్ప
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుమల : శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. నాలుగో రోజైన బుధవారం ఉదయం కల్పవృక్ష వాహనంపై రాజమన్నార్ అలంకారంలో మలయప్పస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి సర్వభూపాల వాహనంపై గజేంద్ర మోక్షం అవతారంలో అభయమిచ్చారు. వాహన సేవల ముందు కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి, ఢిల్లీ స్థానిక సలహామండలి అధ్యక్షులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, టీటీడీ జేఈఓలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్ఓ నరసింహకిషోర్, ఎస్పీ పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



గోపికాకృష్ణుల వైభవాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు



ప్రమథగణాలతో పరమశివుని వేషధారుల విన్యాసం



గోపికా ప్రియవల్లభుని నృత్య భంగిమ



మహిళల భక్తిపారవశ్యం

విద్య, వైద్యంపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి

- 16 మెడికల్ కాలేజీలు ఏర్పాటు
- విదేశీ విద్యకు ప్రాధాన్యం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: 'వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యరంగంపై ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో నూతన మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు విదేశాల్లో చదువుకునేందుకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు.' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం పుంగనూరు ఏరియా ఆస్పత్రిని ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్పతో కలసి ప్రారంభించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా కార్యక్రమాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. 30 ఏళ్లుగా పాలించిన ఒకే కుటుంబం పుంగనూరును అభివృద్ధి చేయలేదన్నారు. సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు పుంగనూరులో రెండు రిజర్వాయర్లు నిర్మించి, తాగు, సాగునీరు అందించే కార్యక్రమం చేపట్టామన్నారు. దీన్ని ఓర్చుకోలేని చంద్రబాబు అండ్‌కో తప్పుడు కేసులు వేసి, పనులు అడ్డుకున్నారని ఆరోపించారు. చంద్రబాబు ప్రస్తుతం మేనిఫెస్టోలో ఇంటికి ఒక బంగారు ముద్ద ఇస్తామని చెప్పినా నమ్మేస్థితిలో ప్రజలు లేరని ఎద్దేవా చేశారు. ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, ఓట్లు అడగాలన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి , చిత్రంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్

ఎక్కడివారికైన ఇక్కడే వైద్యం

ఎక్కడివారికి ఏ జబ్బు చేసినా ఇక్కడికి వచ్చి వైద్యం చేసుకునేలా పుంగనూరు ఆస్పత్రిని అభివృద్ధి చేస్తామని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

గతంలో వైద్యం కోసం బెంగళూరు, తిరుపతికి వెళ్లేవారని, ఇక మీదట పుంగనూరు ఆస్పత్రిలో సకల సదుపాయాలు పొందవచ్చని వెల్లడించారు.

పేదలకు ఆక్సిజన్ జగన్‌మోహన్‌రెడ్డి

అన్ని వర్గాల ప్రజలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆక్సిజన్ లాంటి వారని ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి స్పష్టం చేశారు. పేదల తలరాతలను మార్చుతున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ షణ్మోహన్, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఏపీఎంఎస్ఐడీటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు నాలుగో విడత 'చేదోడు'

- 10177 మందికి లబ్ధి
- రూ.10.177 కోట్ల పంపిణీ

తిరుపతి అర్బన్ : జిల్లాలోని రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లు, ఇతర చేతి వృత్తుల వారిలో అర్హులకు జగనన్న చేదోడు పథకం కింద నాలుగో విడత ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. గురువారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి నిధులు విడుదల చేయనున్నారు. ఈ మేరకు తిరుపతి కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి బుధవారం వెల్లడించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 10,177 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.10వేల చొప్పున మొత్తం రూ.10.177 కోట్లు జమ చేయనున్నట్లు వివరించారు.

గోపాలా.. సర్వభూపాలా



కల్పవృక్షవాహనంపై కల్యాణ వెంకన్న చిద్విలాసం

- కనులపండువగా తుమ్మలగుంటలో బ్రహ్మోత్సవాలు
- కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై ఊరేగిన కల్యాణ వెంకన్న
- సేవల్లో పాల్గొన్న ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి



సర్వభూపాల వాహన సేవలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



వాహన సేవలో కోలాటం

తిరుపతి రూరల్ : తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన బుధవారం ఉదయం శ్రీవారు కల్పవృక్ష వాహనంపై విహరించారు. రాజమన్నార్ అలంకారంతో ఉభయ దేవేరులతో కలిసి భక్తులను అనుగ్రహించారు. మంగళవాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటాలు, దేవతా మూర్తుల కళారూపాల నడుమ పురవీధుల్లో వాహన సేవ కోలాహలంగా సాగింది. అనంతరం స్వామి, అమ్మవార్లకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరి నీళ్లతో అభిషేకం చేశారు. రాత్రి సర్వభూపాల వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్యాణ వెంకన్న కొలువుదీరారు. మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.కార్యక్రమాల్లో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు, ఈఓ నల్లందుల సుబ్బరామిరెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, హర్షిత్‌రెడ్డి, కంకణబట్టార్ గిరిధర్ భట్టాచార్యులు పాల్గొన్నారు.

సారె సమర్పణ

తుమ్మలగుంటకు చెందిన శ్రీవారి భక్తులు ఊరేగింపుగా సారె తీసుకువచ్చారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులు తీసుకువచ్చిన సారెను దేవదేవునికి సమర్పించారు.

గరుడ సేవకు భారీ ఏర్పాట్లు



బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీఎస్పీ యశ్వంత్

కల్యాణ వెంకన్న నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి నిర్వహించనున్న గరుడసేవకు భారీ ఏర్పాట్లు చేశారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈమేరకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, డీఎస్పీ యశ్వంత్ సమీక్షించారు. వారు మాట్లాడుతూ భక్తుల రద్దీకి అనుగుణంగా సుమారు 200 మంది పోలీసులతో బందోబస్తు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే వీధుల్లో బారికేడ్లు , గ్రామ శివార్లలో వాహనాల పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయించినట్లు వెల్లడించారు. భక్తుల సౌకర్యార్థం గరుడ వాహన సేవను అర్ధరాత్రి వరకు కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. నిర్ణయించారు.



దేవతామూర్తుల వేషధారణలో కళాకారులు

గరుడ సేవకు వేళాయె..

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం గరుడసేవను తిలకించేందుకు విచ్చేసే లక్షలాది మంది భక్తుల భక్తుల సౌకర్యార్థం టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. దాదాపు 2 లక్షల మంది భక్తులు గ్యాలరీల్లో వేచి ఉండేలా చర్యలు తీసుకుంది. గరుడ సేవను రాత్రి 6.30 గంటలకు ప్రారంభించి భక్తులందరూ దర్శించుకునేలా అర్ధరాత్రి 2 గంటల వరకు సాగేలా ప్రణాళిక రూపొందించారు.ఉదయం 8 నుంచి రాత్రి ఒంటి గంట వరకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, 2.50 లక్షల మజ్జిగ ప్యాకెట్లు అందించనున్నారు. ఏర్పాట్లు ఇలా.. - తిరుమల

- రాత్రి 6–30 గంటలకే వాహన సేవ ప్రారంభం
- గ్యాలరీల్లో నిరంతరాయంగా అన్నప్రసాదాలు
- ఎక్కువ మందికి దర్శనం కల్పించేందుకు గ్యాలరీల రీఫిల్లింగ్ ఏర్పాట్లు
- పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్లలో వేచి ఉండే భక్తులను సుపథం, సౌత్ వెస్ట్ కార్నర్, గోవింద నిలయం నార్త్ వెస్ట్ గేట్, నార్త్ ఈస్ట్ గేట్ల ద్వారా గ్యాలరీల్లోకి అనుమతిస్తారు.
- మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఉదయం 8 నుంచి రాత్రి ఒంటి గంట వరకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందిస్తారు.
- గ్యాలరీల్లోనూ ఉదయం నుంచి రాత్రి వరకు పులిహోర, టమాటా బాత్, బిసిబెళాబాత్ తదితర అన్నప్రసాదాల ప్యాకెట్లు, తాగునీటి అందజేస్తారు.
- అలిపిరి పాత చెక్ పాయింట్ వద్ద బైక్ పార్క్ చేసుకునే సదుపాయం కల్పించారు.
- వైద్యసేవల కోసం మాడవీధుల్లో మొబైల్ క్లినిక్‌లు, 7 అంబులెన్సులు, డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది నియమించారు.
- గడరు సేవను తిలకించేందుకు మాడ వీధులు, భక్తుల రద్దీగా ఉండే మ్యూజియం, వరాహ స్వామి విశ్రాంతి గృహం, అన్నదానం కాంప్లెక్స్, రాంభగీచా విశ్రాంతి గృహం, ఫిల్టర్ హౌస్ ఇతర ప్రాంతాల్లో కలిపి 20 పెద్ద డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటు చేశారు.

భారీ భద్రతా ఏర్పాట్లు

గరుడసేవను తిలకించేందుకు గురువారం అత్యధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు టీటీడీ సీవీఎస్వో నరసింహ కిషోర్ తెలిపారు.

ఆర్టీసీ సన్నద్ధం

తిరుపతి అర్బన్: గరుడ సేవ సందర్భంగా గురువారం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను సిద్ధం చేసింది. సాధారణంగా రోజూ 240 సర్వీసులను నడుపుతోంది. గరుడ సేవ రోజున 340 సర్వీసులతో 6వేల ట్రిప్పులు నడిపి 2.20 లక్షల మందికి రవాణా సౌకర్యం కల్పించాలని ప్రణాళిక రూపొందించింది. దీంతో పాటు సాధారణంగా నడుస్తున్న 50 ఏసీ విద్యుత్ సర్వీసులు, రేణిగుంటకు నడుస్తున్న 14 ఏసీ విద్యుత్ సర్వీసులను తిరుమలకు కేటాయించారు.

క్షేత్రస్థాయికి 'సంక్షేమం'

- ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించండి
- ముఖ్యమంత్రి చేసిన మేలును తెలియజేయండి
- గృహ సారథులు, పార్టీ శ్రేణుల సమావేశంలో నేదురుమల్లి

రాపూరు : నాలుగున్నరేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ ఫలాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం రాపూరు సమీపంలోని తెలుగుగంగ అతిథి గృహంలో ఏపీకి వైనాట్ జగనన్న కార్యక్రమంపై గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, సోషల్ మీడియా కమిటీ సభ్యులు, నేతలతో సమావేశం నిర్వహించారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. దీనిపై సమష్టిగా పనిచేస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. జిల్లాలోని 7 నియోజకవర్గాలు గెలిపించాల్సిన బాధ్యత తనపై ఉందని, అందులో వెంకటగిరిలో అత్యధిక మెజార్టీ తీసుకురావాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



టీడీపీ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీలో చేరిక

స్థానిక వాటర్‌ట్యాంక్, వెంకటేశ్వరపురం, మల్లమ్మ గుంట, ఆంజనేయపురం ప్రాంతాల్లోని టీడీపీ చెందిన 30 కుటుంబాలు రామ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రజాసేవే పరమావధి

మండలంలోని నెల్లేపల్లె పరిధిలోని తూమాయి, రేగడపల్లెలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, మండల కన్వీనర్ పాపకన్ను దయాకర్‌రెడ్డి, రాష్ట్రరైతు సంఘం కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ నెల్లూరు రవీంద్రారెడ్డి నాయకులు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, గంగిశెట్టి వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, సర్పంచ్‌లు జయమ్మ, మోహన్ పాల్గొన్నారు.

బస్సు ఢీకొని విద్యార్థి మృతి

తిరుచానూరు(చంద్రగిరి) : పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై అగ్రహారం సమీపంలో బుధవారం ఓ ప్రైవేటు కళాశాల బస్సు ఢీకొని విద్యార్థి మృతి చెందాడు. వివరాలు.. తిరుచానూరు పంచాయతీ చైతన్యపురానికి చెందిన సుబ్రమణ్యం కుమారుడు సంతోష్(16) ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. ద్విచక్రవాహనంపై వెళుతుండగా ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో చిన్నారికి తీవ్రగాయాలు



గాయపడిన గీతుమాలిక

బుచ్చినాయుడుకండ్రిగ : స్థానిక అరుంధతి వాడకు చెందిన జయలక్ష్మి, వెంకటేష్ కుమార్తె గీతుమాలిక(3)పై బుధవారం కుక్కల గుంపు దాడి చేసింది. వీధిలో చిన్నారి ఆడుకుంటుండగా పదికి పైగా కుక్కలు కరిచేసి తీవ్రంగా గాయపరిచాయి. బిడ్డను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ గీతుమాలికకు 30కి పైగా కుట్లు పడినట్లు తల్లిదండ్రులు తెలిపారు.

జేసీబీ స్వాధీనం

దక్కిలి(బాలాయపల్లి) : మండలంలోని తెల్లరాయిని అక్రమంగా తవ్వుతున్న జేసీబీని బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. నాయుడుచెరువు కండ్రిగ (పెండేరెడ్డివారిపల్లి) సమీపంలోని ప్రభుత్వ భూముల్లో తెల్లరాయి తవ్వుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసినట్లు వెల్లడించారు.

వీఆర్‌ఓ మృతి

నాయుడుపేట : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వీఆర్‌ఓ సునీల్(47) మంగళవారం రాత్రి మృతి చెందాడు. గతంలో ఆయన నాయుడుపేట, పెళ్లకూరులో విధులు నిర్వహించినట్లు తెలిసింది. దీనిపై సమాచారం అందుకున్న బంధువులు మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. బుధవారం అంత్యక్రియలు జరిపించారు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు



పార్టీలో చేరిన వారితో కలిసి జై జగన్ నినాదాలు చేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు : మండలంలోని అముడూరు పంచాయతీ వెంకటాపాళెం ఎస్టీ కాలనీలో బుధవారం సాయంత్రం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం సమక్షంలో 30 కుటుంబాలకు పైగా టీడీపీ నేతలు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. గాజుల అంకయ్య, శంకరయ్య, శంకరమ్మ, విజయ్, వెంకటయ్య, సుబ్బమ్మ, తుపాకుల రామచంద్రయ్య, కడూరు సుబ్బరామయ్య, అత్తూరు సుబ్రమణ్యం తదితర నేతలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్ రెడ్డి, సర్పంచ్ సుబ్బమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్, నాయకులు పరమాల చంద్రశేఖర్, పెరుమాళ్, గోవిందరెడ్డి, మురళి పాల్గొన్నారు.

ప్రియుడితో భర్తను చంపించిన భార్య

- హత్య కేసును ఛేదించిన పోలీసులు



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

సూళ్లూరుపేట రూరల్ : చెన్నై– నెల్లూరు జాతీయ రహదారి పక్కన ఈ నెల 15వ తేదీన జగదీష్ అనే వ్యక్తి హత్యకు గురైన కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని, ప్రియుడితో భార్యే తన భర్తను చంపించిందని గుర్తించారు. బుధవారం ఈ మేరకు ఇన్‌చార్జి సీఐ సోమయ్య వివరాలు వెల్లడించారు. పట్టణంలోని కృష్ణవేణి నగర్‌కు చెందిన నెల్లూరు జగదీష్, అదే ప్రాంతానికి చెందిన చిత్ర అనే యువతిని పదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. జగదీష్ ఓ చికెన్ షాప్‌లో పని చేసేవాడు. చిత్ర తడ మండలం మాంబట్టులోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తోంది. అదే కంపెనీలో డ్రైవర్‌గా పనిచేసే జగదీష్ స్నేహితుడు తొండా కృష్ణమూర్తితో చిత్రకు పరిచయమైంది. క్రమేణా వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయంలో భార్యను అనుమానించిన జగదీష్ తరచూ మద్యం సేవించి గొడవపడేవాడు. ఈ క్రమంలో చిత్ర తన భర్తను అడ్డుతొలగించుకోవాలని కృష్ణమూర్తి చెప్పింది. అందుకు ఒప్పుకున్న కృష్ణమూర్తి తన బైక్‌పై జగదీష్‌ను ఎక్కించుకుని మన్నారుపోలూరు వద్ద పొలాల్లో మద్యం తాగించాడు. మత్తులో ఉన్న జగదీష్‌కు పదునైన బ్లేడుతో గొంతు కోసేశాడు. రక్తగాయాలతో జగదీష్ సమీపంలోని జాతీయ రహదారి పక్కన పడిపోయి మృతి చెందాడు. అనంతరం జగదీష్ చనిపోయాడంటూ కృష్ణమూర్తి ప్రియురాలికి వేకువజామున 3గంటలకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. ఫోన్ డేటా, సీసీ కెమెరా ఫుటేజీ అధారంగా పోలీసులు కేసు ఛేదించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసు పరిష్కారంలో ప్రతిభ కనబరచిన ఎస్‌ఐలు బ్రహ్మానాయుడు, శ్రీనివాసులురెడ్డిని సీఐ అభినందించారు.

దళితుల అభ్యున్నతే జగనన్న లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున. చిత్రంలో ఎస్సీ సెల్ నాయకుడు జూపూడి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వరప్రసాద్‌రావు తదితరులు

- వైఎస్సార్‌సీపీ తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఎస్సీ నేతల సదస్సులో మంత్రి మేరుగు నాగార్జున

నెల్లూరు (దర్గామిట్ట): దళితుల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రమిస్తున్నారని మంత్రి మేరుగు నాగార్జున వెల్లడించారు. బుధవారం నెల్లూరులోని రవీంద్రనాథ్ ఠాగూర్ కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఎస్సీసెల్ ముఖ్య నాయకులతో సామాజిక బస్సుయాత్ర విజయవంతంపై సమావేశం నిర్వహించారు. మంత్రి మేరుగు మాట్లాడుతూ చంద్రబాబు హాయంలో దళితుల సంక్షేమానికి ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. పైగా ఎస్సీ కులంలో ఎవరైనా పుట్టాలని అనుకుంటారా అని చంద్రబాబు అవమానించారని మండిపడ్డారు. దళితులను అచ్చెన్నాయుడుతన్నిన ఘటనలు కూడా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖలో దళిత మహిళను వివస్త్రను చేస్తే చంద్రబాబు ఏ మాత్రం చలించలేదన్నారు. గుంటూరులో రవికుమార్ అనే ప్రభుత్వ ఉద్యోగిని చంపితే కేసు కూడా పెట్టనీయలేదని గుర్తుచేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతోనే దళితులకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వెల్లడించారు. మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించుకుని జగనన్నకు ముఖ్యమంత్రిని చేసుకునే బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్ మాట్లాడుతూ చీకటి ముసుగులో ప్రతిపక్షాలు ఉన్నాయని, వెలుతురుతో ప్రజల పక్షాన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉన్నారని తెలిపారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా దళితులకే ఎక్కువ మేలు చేకూరిందన్నారు. సామాజిక న్యాయ బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు అందరం సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ దళితులంటే చంద్రబాబుకు చులకనని ఆరోపించారు. అంబేడ్కర్ తర్వాత ఎస్సీ, ఎస్టీలకు నిష్పక్షపాతంగా న్యాయం చేసింది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని కొనియాడారు. సమావేశంలో ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, బల్లి కల్యాణ్‌చక్రవర్తి, ప్రాంతీయ అధ్యక్షుడు దేవదానం, నల్లారి బాబు, దేవప్రసాద్, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు ఏసునాయుడు, రైల్వే బోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యం పెంచేలా బోధన



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెంచేలా బోధన ఉండాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే-2023 నిర్వహణపై బ్లాక్ లెవెల్ కో- ఆర్డినేటర్లు, నోడల్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 3, 6, 9 తరగతుల్లోని విద్యార్థులకు భాషతోపాటు సబ్జెక్టుల్లో స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వేను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు మెయిన్ పరీక్షల కోసం విద్యార్థులకు మోడల్ ఎగ్జామ్ జరిపించాలని సూచించారు. తద్వారా విద్యార్థి ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నాడో గుర్తించి వారికి అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించాలని కోరారు. జిల్లాకు మంచి ర్యాంకు తీసుకువచ్చేందుకు ఎంఈఓలు కృషి చేయాలని స్పష్టం చేశారు. డీఈఓ శేఖర్ మాట్లాడుతూ ఈ మేరకు నవంబర్ 3వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు,ఎయిడెడ్ పాఠశాలల్లో ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్షలు జరపించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీవైఈఓ శివప్రసాద్ , డైట్ వైస్ ప్రిన్సిపల్ సుబ్రమణ్యంరాజు, డీసీఈబీ సెక్రెటరీ వంశీ రాజు, సర్వశిక్ష అభియాన్, సీఎంఓ సురేష్, శివ శంకరయ్య పాల్గొన్నారు.